
రాజకీయ కార్యకలాపాల్లో

బాలలను వినియోగిస్తే చర్యలు

పార్వతీపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 ఏళ్లలోపు బాలలను రాజకీయ కార్యకలాపాలకు వినియోగించరాదని కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.రామకృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాల్లో, ప్రచార పనులకు రాజకీయ పార్టీల వారు బాలలను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే.. బాల కార్మిక వ్యవస్థ నిషేధ చట్టం ప్రకారం ఆరు నెలల పాటు జైలు శిక్ష, రూ.50 వేలు వరకు జరిమానా ఉంటుందని పేర్కొన్నారు.

జగనన్న బాదుడే బాదుడు

- ఎన్నికల ముందు పట్టణవాసులకు పన్నువాత
- ఆస్తిపన్ను మరోసారి 15 శాతం పెంచిన వైసీపీ సర్కారు
- తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



(పార్వతీపురంటౌన్/సాలూరు, ఏప్రిల్ 15)

ఎన్నికల ముందు వైసీపీ సర్కారు పట్టణవాసులకు పన్ను వాత పెట్టింది. ఏటాలానే ఈసారి కూడా విలువ ఆధారిత ఆస్తి పన్నును 15 శాతం పెంచింది. పన్ను భారం మరింత పెరగడంతో జిల్లావాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా ఆస్తిపన్ను పెంచలేదు. పైగా పట్టణాల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. 2020-21 తరువాత విలువ ఆధారిత ఆస్తి పన్ను ప్రవేశ పెట్టి... దానిని ఏటా 15 శాతం పెంచుతూ పట్టణ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల ముందు కూడా 15 శాతం పెంచడంతో జిల్లావాసులు మండిపడుతున్నారు. వైసీపీ సర్కారు తీరుపై పెదవి విరుస్తున్నారు. ఒకవైపు రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో సతమతమ వుతుంటే.. మరోవైపు ఎక్కడా లేని విధంగా పన్నులు విధించడం ఎంతవరకు సమంజమని సామాన్య, మధ్యతరగతి వర్గాల వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

● 2014-15లో సాలూరులో ఓ మహిళ తన డాబా ఇంటికి గాను ఆరు నెలలకు రూ.1060 చొప్పున పన్ను చెల్లించే వారు. కాగా ప్రస్తుతం 2024-25కి గాను రూ.1854 చెల్లించాల్సి ఉంది. దీంతో ఆమె లబోదిబోమంటోంది..
... ఇలా జిల్లాలో అనేకమంది గగ్గోలు పెడుతున్నారు. ఏటా పెరుగుతున్న ఇళ్లు, కొళాయి పన్నులను చెల్లించలేక ఆర్థికంగా సతమతమవుతున్నారు. మరోవైపు సకాలంలో ఆ పన్నులు చెల్లించకపోతే అపరాధ రుసుం, అదనపు వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దీంతో కొందరు అప్పులు చేసి మరీ పన్నులు కట్టాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాకేంద్రం పార్వతీపురం విషయానికొస్తే.. గత ఐదేళ్ల కిందట వరకు పట్టణంలోని 13,225 ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, ఖాళీ స్థలాలు ఉండగా రూ.3కోట్లు ఆస్తి పన్ను వసూళ్ల డిమాండ్ ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత పరిస్థితి మారింది. విలువ ఆధారిత ఆస్తి పన్ను విధానం అమలులోకి తెచ్చాక.. 2020-21 నుంచి 2023-24 నాటికి రూ.4.48 కోట్లకు ఆస్తి పన్ను డిమాండ్ పెరిగిందని రెవెన్యూ అధికారుల లెక్కలే చెబుతున్నాయి. ఇక ఖాళీ స్థలాలకు సంబంధించి గతంలో పన్ను నామమాత్రంగా ఉండేది. కానీ 2023-24కి గాను రూ.57 లక్షల వరకు వసూలు చేశారంటే.. పన్నుల బాదుడు ఏవిధంగా ఉందనేది అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఇంటి పన్నులు కూడా ఏటా 15 శాతం మేర పెంచుకుంటూ పోతుండడంతో పట్టణవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం ఉన్న ఆస్తిపన్ను డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు చెబుతుండడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ పన్నులు ఎలా కట్టాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సాలూరులో ఇలా....

సాలూరులోని 29 వార్డుల్లో 11,763 ఇళ్లు , వాణిజ్య సముదాయాలతో పాటు 752 ఖాళీ స్థలాలు ఉన్నాయి. కాగా 2019-20లో రూ.2.62 కోట్ల మేర పన్ను వసూలు ఉండేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2020-21 నాటికి రూ.4.28కోట్ల మేర ఆస్తి పన్ను డిమాండ్ పెరిగింది. తాజాగా పెంచిన 15 శాతం విలువ ఆధారిత ఆస్తి పన్ను ప్రకారం 2024-25 నాటికి రూ.నాలుగు కోట్ల 81 లక్షల మేర డిమాండ్ పెరిగిందని అధికారులు చెబుతున్నారు. దీనిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా.. 'సెంట్రల్ వాల్యూ సిస్టమ్ ప్రకారం ఏటా 15 శాతం చొప్పున పన్నులు పెరుగుతూ ఉంటాయి. వాటిని సంబంధిత యజమానులు చెల్లించాల్సిందే. దీనిలో మున్సిపల్ అధికారుల ప్రమేయం ఏమీ ఉండదు.' అని ఆయన తెలిపారు.



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం



సాలూరు మున్సిపల్ కార్యాలయం

ఎన్నికల ముందు ఉన్నట్టుండి ఒకేసారి ఇళ్ల పన్నులు కట్టాలనడంతో ఆందోళన చెందుతున్నారు.

పెంచుకుంటూ పోతే ఎలా..

ఐదేళ్ల కిందట వరకు ఇంటి పన్నులు చెల్లింపులనేవి న్యాయబద్ధంగానే ఉండేవి. మూడు , నాలుగేళ్ల నుంచి ఇంటి పన్నులు పెంచుకుంటూ వస్తుండడం వల్ల మాలాంటి వాళ్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంటి మీద, చెత్తమీద , ఖాళీ స్థలంపై పన్నులు విధిస్తుండడం వల్ల జీవనం కష్టతరంగా మారింది.

- రామారావు, రిటైర్డ్ ఉద్యోగి, పార్వతీపురం

ఇబ్బందులు తప్పడం లేదు

2019 వరకు ఇంటి పన్ను చెల్లించడంలో పెద్దగా ఇబ్బందులు లేవు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా ఏటా పన్నులు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో మాలాంటి వారు నానా అవస్థలు పడుతున్నాం.

- బి.శ్రీనివాసరావు, సాలూరు

ఏటాలానే..

2020-21 నుంచి 15 శాతం మేర విలువ ఆధారిత ఆస్తి పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా అలానే పన్ను పెంచారు.

- రుబేను, ఆర్‌వో, పార్వతీపురం

పంచాయతీలకూ పన్ను పోటు

జియ్యమ్మవలస: జిల్లాలోని పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లపైనా పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించారు. ఇప్పటికే సగటున 85శాతం వసూళ్లు పూర్తి చేశారు. అయితే మిగిలిన 15శాతం కూడా పన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో సర్పంచ్, గ్రామ పెద్దల సహకారంతో గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఆ పనిలో నిగమ్న మయ్యారు. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను పాత బకాయి రూ.77.22 లక్షలు. ప్రస్తుత బకాయి రూ.4.20 కోట్లు. మొత్తంగా రూ.4.98 కోట్లు మేర బకాయిలుండగా.. ఇప్పటివరకు రూ.4.15 కోట్ల మేర వసూలు చేశారు. ఇంకా రూ.82.15 లక్షల మేర బకాయిలు ఉండగా.. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో కొమరాడ మండలం నుంచి 78 శాతం, వీరఘట్టం మండలం నుంచి 65 శాతం మేర మాత్రమే పన్నులు వసూళ్లయ్యాయి. మిగిలిన చోట్ల 95 నుంచి 98 శాతం మేర పన్నులు వసూలు చేశారు. మక్కువ, బలిజిపేట, గరుగుబిల్లి, కొమరాడ, పాచిపెంట, పార్వతీపురం, సాలూరు, సీతానగరం మండలాల నుంచి రూ.33.04 లక్షల మేర వసూళ్లు చేయాల్సి ఉంది. భామిని, కురుపాం, జియ్యమ్మవలస, పాలకొండ, సీతంపేట, వీరఘట్టం మండలాల నుంచి రూ.49.15 లక్షల మేర వసూళ్లు చేయాల్సి ఉంది. అయితే దీనిపై పంచాయతీ వాసులు మండి పడుతున్నారు.

శత శాతం వసూళ్లు చేయాలి

ఇంటి పన్ను వసూళ్లు అనేది పంచాయతీ కార్యదర్శుల విధుల్లో ఒక భాగం. కచ్చితంగా ఇంటి పన్ను వసూళ్లు శత శాతం జరగాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం.

- బి.సత్యనారాయణ, డీపీవో, పార్వతీపురం మన్యం


చింతలబెలగాంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి, సిబ్బంది


రోడ్‌షోలో పాల్గొన్న జనం

నీరాజనం

- చంద్రబాబుకు ఘన స్వాగతం
- రోడ్‌షోకు పోటెత్తిన జనం
- పసుపెక్కిన రాజాం

ప్రసంగిస్తున్న చంద్రబాబు

రాజాం/రూరల్, ఏప్రిల్ 15: ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయనగరం జిల్లా రాజాం వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు జనం నీరాజనం పలికారు. అడుగడుగునా బాబుపై పూలవర్షం కురిపించారు. జీఎంఆర్ఐటీ ప్రాంగణంలో హెలికాప్టర్ దిగిన చంద్రబాబు ప్రత్యేక బస్సులో కేర్ జంక్షన్, డోలపేట, సీతారామ థియేటర్ మీదుగా వస్తుండగా కిలోమీటర్ మేర జేజేలు పలికారు. దారిపొడవునా పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు జై తెలుగు దేశం.. జై.జై తెలుగుదేశం అంటూ నినాదాలు చేశారు. అనంతరం పాలకొండ రోడ్‌లో చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలు, జగన్‌పై విమర్శలు చేస్తున్న సమయంలో ప్రజలు చప్పట్లతో హోరెత్తించారు. ఆయన మాట్లాడుతున్నంత సేపూ సీఎం.. సీఎం అంటూ మద్దతు పలికారు. దీంతో ఉప్పొంగిన ఉత్సాహంతో చంద్రబాబు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, రాజకీయ ఎత్తుగడలు, కోడికత్తి, రాయి డ్రామాలపై మరింత ఆవేశంగా మాట్లాడారు. జగన్ అనుసరిస్తున్న విధానాలన్నింటినీ చంద్రబాబు తూర్పారబట్టారు.

ఇదిలా ఉంటే రాజాం పట్టణం పూర్తిగా పసుపుమయంగా మారింది. సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన హోర్డింగులు, బ్యానర్లు, భారీ కటౌట్లు, జెండాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జనమా.. బంతిపూల వనమా..

చంద్రబాబు రోడ్‌షో, బహిరంగసభకు హాజరైన జనం చూస్తే.. జనమా.. బంతిపూల వనమా అన్న చందంగా కనిపించింది. బాబు మాట్లాడుతున్న వేదిక నుంచి అటు డోలపేట వరకూ కిలోమీటర్ మేర జనప్రభంజనం కనిపించింది. వేదిక ప్రాంతంలో బాబును చూసేందుకు, ప్రసంగం వినేందుకు గంట ముందే భవనాల పైకి జనం చేరుకుని ఎండను సైతం లెక్క చేయకుండా నిరీక్షించారు.

శ్రేణుల్లో ఉత్సాహం

ఎన్నికలు సమీపిస్తున్న వేల చంద్రబాబు పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ఉమ్మడి జిల్లాలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపే దిశగా బాబు పర్యటన ఆద్యంతం కొనసాగింది.

ఒత్తిళ్లే కారణమా?

- వలంటీర్ల రాజీనామాలపై సందేహాలు



సాలూరు రూరల్, ఏప్రిల్ 15: జిల్లాలో కొందరు వలంటీర్ల రాజీనామాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక కొంతమంది ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు ఒత్తిళ్లే కారణమన్న వ్యాఖ్యలు గట్టిగా వినిపిస్తున్నాయి. తక్షణమే రాజీనామా చేయాలని కొద్దిరోజులుగా వలంటీర్ల ఫోన్లకు మెసేజ్‌లు పంపిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు.. 'వచ్చేది వైసీపీ ప్రభుత్వమే, ఇప్పుడు రాజీనామాలు చేసిన వారి బాధ్యత మాదే' అని చెబుతున్నారు. మొత్తంగా నయానో..భయానో ఒప్పించి రాజీనామాలు చేయిస్తున్నట్లు సమాచారం. తాజాగా సోమవారం సాలూరు మండలంలో 68 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. జీగిరాం, కొత్తవలస, కూర్మరాజుపేట, నెలిపర్తి, నార్లవలస, ఖరాసవలస తదితర పంచాయతీలకు చెందిన వారు ఎంపీడీవో ఫణీంద్రకుమార్‌కు రాజీనామా పత్రాల ను అందించారు. ఆ సమయంలో ఆయా వలంటీర్ల పక్కన సాలూరు మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జీగిరాం ఎంపీటీసీ అల్లు సూరప్పలనాయుడు ఉండడం విశేషం. అంతేకాక వలంటీర్లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట రాజీనామా పత్రాలతో గ్రూప్ ఫొటో దిగినప్పుడు అక్కడే పెదపథం, జీగిరాం, నెలిపర్తి, ఖరాసవలస, కూర్మరాజుపేట వైసీపీ నేతలుండడం యాదృచ్ఛికమేనా అనే సందే హాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా మరో 34 మంది సైతం రాజీనా మాలకు ముందుకొచ్చినా.. వారు ఇంకా ఎంపీడీవోకు పత్రాలను అందించలేదు. ఏదేమైనా తొలిరోజు మండలంలో వలంటీర్లు రాజీనామాల సంఖ్య ముందుగా వైసీపీ నేతలు ఆశించిన 102 మంది కాకుండా కేవలం 68 మంది దగ్గరే నిలిచి పోయింది. ఇదిలా ఉండగా మండలంలో ప్రధాన పంచాయతీలు, గిరిజన ప్రాంత, గిరిశిఖర పంచాయతీలకు చెందిన వారు ఎమ్మెల్యేల సందేశాలు, వైసీపీ నేతల ఒత్తిడికి తలొగలేదు. వారంతా రాజీనామాలకు ముందుకు రాలేదు.

24 మంది వలంటీర్ల తొలగింపు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలో నర్సిపురం, పెదబొండపల్లి గ్రామాలకు చెందిన 24 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో షేక్ అహ్మద్ జావిద్ సోమవారం చెప్పారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే జోగారావు ఇంటికి వెళ్లిన వలంటీర్లపై ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామ న్నారు. ఈ మేరకు 24 మంది వలంటీర్లను సర్వీసును నుంచి తొలగించినట్టు ఎంపీడీవో వెల్లడించారు.

మరికొందరు ముందస్తుగా రాజీనామాలు..

పార్వతీపురం మండలంలో పెద్దబొండపల్లి, నర్సిపురం గ్రామాలకు చెందిన కొందరు వలంటీర్లు ముందస్తుగానే రాజీనామాలు చేశారు. ఈ నెల 14న వారంతా వైసీపీ అభ్యర్థి జోగారావు ఇంటికి వెళ్లినట్లు అధికారులు గుర్తించి విచారణ ప్రారంభించారు. దీంతో ముందస్తుగానే ఆయా గ్రామాలకు చెందిన 26 మంది వలంటీర్లు సోమవారం రాజీనామాలు పత్రాలను ఎంపీడీవోకు అందించారు.

నేడు స్లాస్ సర్వే

- ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు డీఈవో సూచనలు

సాలూరు రూరల్,ఏప్రిల్ 15: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నాలుగో తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకోవడానికి మంగళ వారం స్టేట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాస్)ను నిర్వహించనున్నారు. ఇందుకు గాను జంబ్లింగ్ పద్ధతిలో నియమించిన ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లతో సోమవారం డీఈవో జి.పగడాలమ్మ తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సర్వే చేసే విధానంపై పలు సూచనలిచ్చారు. జిల్లాలో 15 మండలాల్లో 149 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సర్వే కోసం ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయా స్కూళ్లలో నాలుగో తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లంపై నిర్దీత సర్వే ఫారంపై నిర్వహించే ఈ పరీక్షను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పర్యవేక్షించనున్నారు.

వదలని గజరాజులు

- గ్రామ సమీపాల్లోనే సంచారం
- పంటలు ధ్వంసం
- ఆందోళనలో ప్రజలు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 15 : జియ్యమ్మలస మండలాన్ని గజరాజులు వీడడం లేదు. గవరమ్మపేట, బాసంగి, పెదమేరంగి, కన్నపుదొరవలస పంచాయతీల్లో కొద్దిరోజులుగా సంచరిస్తూ.. ఆయా గ్రామస్థులను హడలెత్తిస్తున్నాయి. ఆదివారం గవరమ్మపేట పంచాయతీలో ఎరుకులపేట, వెంకటరాజపురం గ్రామాల్లో తిరిగిన ఏనుగులు సోమవారం ఉదయం పెదమేరంగి పంచాయతీ రామినాయుడువలసకు చేరాయి. మధ్యాహ్నం కన్నపుదొరవలసకి చేరుకుని సాయంత్రానికి అదే పంచాయతీలోని సుభద్రమ్మవలస గ్రామ సమీపంలో తిష్ఠ వేశాయి. కాగా ఆయా ప్రాంతాల్లో వరి, అరటి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తక్షణమే మండలం నుంచి గజరాజులను తరలించేలా అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సుభద్రమ్మవలసలో సంచరిస్తున్న ఏనుగులు

చురుగ్గా ఈవీఎంల తరలింపు

పార్వతీపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంల తరలింపు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ సోమవారం ఈ తంతును పరిశీలించారు. ఇప్పటికే ర్యాండమైజేషన్ పూర్తయిందని ఆయన తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు వెల్లడించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీ సమక్షంలో వివిధ నియోజకవర్గాలకు వాహనాల ద్వారా ఈవీఎంలను తరలించారు.


ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రిసైడింగ్ అధికారులదే పూర్తి బాధ్యత

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి


మాట్లాడుతున్న పీవో

సీతంపేట: పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారులదే పూర్తి బాధ్యత అని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ తరగతులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోలింగ్ రోజు పీవో, ఏపీవోలు చేపట్టాల్సిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు నివేదికలు ఇచ్చే ఫారాలు, ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని, నిర్దిష్ట సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- స్ట్రాంగ్ రూం పరిశీలన

సాలూరు,ఏప్రిల్ 15: సాలూరు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ సోమవారం పరిశీలించారు. అనంతరం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల విధులు, ఇతరత్రా అంశాలపై చర్చించారు.


సాలూరులో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

శృంగవరపుకోట రూరల్:చెట్టుపై నుంచి కిందపడి ఓవ్యక్తి మృతిచెందాడు. శృంగవరపుకోట సీఐ మురళీరావు కథనం మేరకు..పూసపాటిరేగ మండలంలోని చల్లవానితోట పంచాయతీశివారు గొల్లపేటకు చెందిన కిలానిరాజారావు (45) సోమవారం ఎస్.కోట మండలంలోని ముషిడిపల్లిపరిధిలోని ఓ లేఅవుట్‌లోకి పనిలోకివచ్చాడు.మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తాటిచెట్టుఎక్కి ప్రమాదవశత్తు కింద పడ్డారు. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు. భార్య కిలాని సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ ఎల్.గోవిందరావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కురుపాం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడిన ఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసుల కథనం మేరకు.. పీటీమండ గ్రామానికి చెందిన యువకులు గుంపస్వామి, దిలీప్, వేణు ద్విచక్ర వాహనంపై కురుపాం సమీపంలోగల పెళ్లివలసలో జరుగుతున్న శుభకార్యానికి వెళ్తుండగా, ప్రమాదవశాత్తు ఆ గ్రామ జంక్షన్ సమీపంలో బైకు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరికి కురుపాం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి, అనంతరం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

1700 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

మెంటాడ: మెంటాడ మండలంలో సోమవారం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్(సీఎస్‌డీటీ) రవిశంకర్ నాటకీయ ఫక్కీలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన 1700 కిలోల బియ్యాన్ని పట్టుకుని ముగ్గురు వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. గిరిజన ప్రాంతాలైన అండ్ర, లోతుగెడ్డ గ్రామాల్లో కొందరు వ్యాపారులు గిరిజనుల నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఆయన ఆయా గ్రామాల్లోని వ్యాపారుల ఇళ్లకు వెళ్లారు. తనతోపాటు మరికొందరు అండ్ర రిజర్వాయర్ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చామని, వంటకు కోటా బియ్యం ఉంటే కొంటామని చెప్పారు. కొద్దిరోజుల కిందటే ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నందున ఆయన ఎవరన్నది తెలియని ముగ్గురు వ్యాపారులు ఆయనకు కోటా బియ్యం ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఈనేపథ్యంలో సీఎస్‌డీటీ మెరుపువేగంతో ఆయా ఇళ్లలో సోదాలు నిర్వహించగా, మొత్తం 1700 కిలోల బియ్యం పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యాపారులపై 6ఏ కేసులు నమోదు చేసినట్టు సీఎస్డీటీ రవిశంకర్ తెలిపారు. సీఎస్‌డీటీ సమయ స్ఫూర్తితో వ్యాపారుల ఆటకట్టించిన తీరును అంతా అభినందిస్తున్నారు.

ఆమదాలవలసలో గడ్డివాముల దగ్ధం

రేగిడి: మండలంలోని ఆమదాలవలసలో సోమవారం ముగ్గురు రైతులకు సంబంధించిన పది ఎకరాలు గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు..గ్రామానికిచెందిన రైతులు రుంకు అప్పలనాయుడు,శాసుబిల్లి వెంకన్న, కెల్ల రాములు కళ్లాల్లో నాలుగు కుప్పల వరిగడ్డివాములు భద్రపరిచారు. అటుగా వెళ్లినవారుఎవరో పొగతాగి పారవేయడంతో ప్రమాదం సంబవించి ఉండవచ్చు. సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక శకటం అగ్నిమాపకఅధికారి సర్వేశ్వరరావు, సిబ్బంది మంటలుఅదుపుచేయడంతో పెద్దప్రమాదం తప్పింది. రూ.30వేలు నష్ట జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



రాజీవ్‌నగర్ కాలనీలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైం:సమస్యాత్మకప్రాంతాల్లో ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడితేచర్యలు తీసుకుంటామని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు హెచ్చరించారు.సోమవారం విజయనగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక ప్రాంతాల్లో గల ఫూల్‌బాగ్ కాలనీ, ఖాదర్‌నగర్, దాసన్నపేట, లంకవీధి, రాజీవ్‌నగర్‌కాలనీలో కేంద్రబలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘాపెట్టామని తెలిపారు. ఎవరైనా ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడితే, రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ కోరాడ రామారావు, ఎస్ఐలు దుర్గాప్రసాద్, రాజేష్, ఏఎస్ఐ పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

● జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు

విజయనగరం క్రైం: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వి.సోమేశ్వరరావు తెలిపారు. సోమవారం విజయనగరంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం నుంచి గంటస్తంభం, కన్యకాపరమేశ్వరిఆలయం, సీఎంఆర్‌షాపింగ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకూ అగ్నిమాపక వారోత్సవాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి, కరపత్రాలను షాపుల యాజమానులు, ప్రజలకు అందజేశారు.రైల్వేస్టేషన్ వద్ద వాటర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

●**లక్కవరపుకోట (కొత్తవలస):**వేసవిలోజరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస అగ్నిమాపక కార్యాలయ అధికారి వై.అశోక్ కుమార్ తెలిపారు. కొత్తవలసలోని పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతస్తులు, పాఠశాలలు, సినిమాహాళ్లలో అగ్నిప్రమాదాలు జరిగేసమయంలో ప్రజలు ఎలా స్పందించాలో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శారదా కంపెనీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

● **శృంగవరపుకోట**: ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులను అగ్నిమాపక అధికారి షేక్ మదీనా వివరించారు. ఈ సందర్భంగా ఫైర్ డ్రిల్ నిర్వహించారు.

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలి: డీఎంవో



సిబ్బందికి సూచనలిస్తున్న జగన్మోహనరావు

సీతానగరం: గ్రామీణప్రజలకు పీహెచ్‌సీల ద్వారా మెరుగైన వైద్య సేవలందించి, వారి ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. సీతానగరం పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. వైద్య పరీక్షల వివరాలు, సేవలపై ఆరా తీశారు. ప్రజలకు కచ్చితంగా వ్యాధి నిర్ధారించడం వల్ల సరైన చికిత్స అందించవచ్చునని తెలిపారు. జ్వర నిర్ధారణ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తే తప్పనిసరిగా రక్తపూతలు (స్లైడ్స్) సేకరించాలని ల్యాబ్ టెక్నీషియన్‌ను, క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు.అనంతరం జగన్మోహన్ రోగులు, గర్భిణులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.పావని, సూపర్ వైజర్లు సత్యవతి, భవాని, శర్మ, వైద్య సిబ్బంది మురళి, నిర్మల, వెంకటలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజాగళం.. జనసంద్రం

రాజాంలో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభ జనసంద్రంగా మారింది. వృద్ధులు, మహిళలు, యువకులు తరలిరావడంతో కేర్ జంక్షన్, డోలపేట, సీతారామ థియేటర్ తదితర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. టీడీపీ అధినేత చంద్రబాబుకు దారిపొడవునా పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో ప్రభుత్వ వైఫల్యాలు, జగన్ నిరంకుశ విధానాలను ప్రజలకు వివరించారు. బాబు మాట్లాడుతున్నంత సేపు యువకులు కేరింతలతో సందడిచేశారు.



రోడ్‌షోలో పాల్గొన్న చంద్రబాబునాయుడు, కొండ్రు, కలిశెట్టి



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న యువకులు



రోడ్‌షోకు తరలివస్తున్న మహిళలు



కిక్కిరిసిపోయిన రాజాం పట్టణం



కోలాటం ఆడుతున్న మహిళలు



చంద్రబాబు ప్రసంగాన్ని వింటున్న యువకులు



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు



రేగిడి మండలంలో సంకిలి నుంచి తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు



వంగర మండలంలోని సీతారాంపురం నుంచి రాజాం బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు

ఉదయం 5.30 గంటలకే మాక్‌పోల్

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

గరివిడి:పోలింగ్‌రోజున ఉదయం 5.30 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గరివిడి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోలింగ్‌శిక్షణను సోమవారం ఆమె సందర్శించారు. ఓటింగ్ రోజున అనుసరించాల్సిన పద్ధతులపై సూచనలిచ్చారు. మాక్‌పోల్‌పై మాట్లాడుతూ అనుకున్న సమయానికి ఏజెంట్లురాకపోతే 15 నిమిషాలు ఎదురుచూసి వచ్చినా, రాకున్నా 5.45 నిమిషాలకు మాక్‌పోల్ ప్రారంభించాలని చెప్పారు. నిర్ణీత సమయానికి ఈప్రక్రియ ప్రారంభించాలని, దీనికోసం ఉదయం 5 గంటలకే పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలని, ఒక్కతప్పు కూడా దొర్లకుండా ఈప్రక్రియ సజావుగా పూర్తిచేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజున పీవోల బాధ్యత అత్యంత కీలకమని చెప్పారు.రీపోలింగ్‌కు ఎక్కడా అవకాశంఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితుల్లో తప్పులు, పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. మూడోవిడత శిక్షణను మే మొదటివారంలో నిర్వహిస్తామన్నారు. మాక్‌పోల్ పూర్తి అయిన వెంటనే వీవీప్యాట్‌లను ఖాళీచేయాలని,ఈవీఎంలను రీసెట్‌చేసిన తరువాతే పోలింగ్ ప్రారంభించాలని తెలిపారు.ఉదయం7గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని, రాజీనామాచేసిన వలంటీర్లకు సంబంధించి బీఎల్‌ఓలు, ఎంపీడీవో ధ్రువీకరించాకే ఏజెంట్లుగా అనుమతించవచ్చని సూచించారు. ఏజెంట్‌తప్పనిసరిగా ఆ నియోజకవర్గానికి చెందిన ఓటరై ఉండాలని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా ఏజెంట్లుగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో రాజాం ఆర్వో జోసెఫ్, ఆయా మండలాల ఏఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాజాం: ఎన్నికల ప్రక్రియపై పూర్తిఅవగాహన కల్పించుకుని ఒక్క తప్పు కూడా దొర్లకుండా ప్రక్రియను సజావుగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు.రాజాం ప్రభుత్వోన్నతపాఠశాలలో ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికలరిటర్నింగ్ అధికారి జె.జోషప్, తహసీల్దార్ ఎస్. కృష్ణంరాజు, ఎన్నికల అధికారి ప్రకాష్, ఆర్ఐలు పాల్గొన్నారు.



గరివిడి: మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

చురుగ్గా ఈవీఎంల తరలింపు

నెల్లిమర్ల : స్థానిక ఈవీఎం గోదాము నుంచి ఈవీఎంల తరలింపు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ఈ తంతును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను వివిధ నియోజకవర్గాలకు కేటాయించిన విషయం తెలిసిందే. వాటిని సీరియల్ నంబర్ల ప్రకారం ఆయా నియోజకవర్గాల వారీగా వేరుచేసి, స్కానింగ్‌చేసి, రాజకీయ పార్టీల ప్రతినిధులసమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు.ఆమె వెంట ఈవీఎంల నోడల్ అధికారి ఉమాశంకర్, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి ఉన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి



మాట్లాడుతున్న సాయిశ్రీ

బొబ్బిలి:ఎక్కడా ఎటువంటి అపోహలు, ఆరోపణలకు తావులేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆర్డీవో, రిటర్నింగ్‌అధికారి ఎ.సాయిశ్రీ కోరారు. సోమవారం పట్టణంలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మునిసిపల్ హైస్కూల్‌లో బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించిన పీవోలు, ఏపీవోలు, సెక్టారు అధికారులకు రెండో విడత శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్య క్రమంలో తహస్లీలార్లు త్రినాథరావు నాయుడు, సులోచన, ఎన్నికల డీటీ రెడ్డి సాయికృష్ణ, డీటీ చిన్నారావు, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, ఎంఈఓ గొట్టాపు వాసు, ఏఎల్‌టీఎంఎస్‌లు జేసీ రాజు, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్, శంకరరావు, మహేశ్ పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

రేగిడి: యువత వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ డి.గోవిందరావు తెలిపారు. సోమవారం రేగిడిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో ఇటీవల శిక్షణపొందిన యువతకు ధ్రువపత్రాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రేగిడి, సీతంపేట మండలాల్లో మార్చి 9నుంచి ఈనెల 13వరకు టువీలర్ మెకానిజం, కార్పెంటరీ, జ్యూట్ ప్రొడక్షన్ మేకింగ్, తేనెటీగల పెంపకం, మష్రుమ్ తయారీపై ఐదుబ్యాచ్‌లకు గాను ఒక్కో బ్యాచ్‌లో 35 మంది నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.ఈ మేరకు రేగిడిలో శిక్షణ పొందిన మష్రుమ్ తయారీదారులు, జ్యూట్ ప్రొడక్షన్ మేకింగ్, టువీలర్ మెకానిజం నిరుద్యోగులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో బొత్స గురినాయుడు మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రాజెక్టుమేనేజర్ రవికిరణ్, మండల కోఆర్డినేటర్ గణపతి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దే విద్య

● జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ సిరికి సూర్యారావు

రామభద్రపురం: దివ్యాంగ విద్యార్థులకు సమగ్రశిక్షావిద్యతోపాటు ఎస్కార్టు రవాణా, స్టైపండ్, రీడర్ అలవెన్స్, ఇంటివద్దనే విద్యసదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా సహితవిద్య కోఆర్డినేటర్ సిరికి సూర్యారావు తెలిపారు. సోమవారం రామభద్రపురం భవితకేంద్రంలో బొబ్బిలి నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా బొబ్బిలి, తెర్లాం, రామభద్రపురం,బాడంగి మండలాల్లోని 3 నుంచి 18 సంవత్సరాల్లోపు 150 మంది దివ్యాంగులు పాల్గొనగా ట్రైసైకిళ్లు, ఎంఆర్ కిట్లు, వీల్‌ఛైర్లు, రోలేటర్స్ వంటి కిట్లకు వైద్యులు నాగిరెడ్డి రవిశంకర్, హిప్సిబా ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ సిరికి సూర్యారావు, ఎంఈఓ ఆమిటి తిరుమల ప్రసాద్, ప్రత్యేకఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, సునీల్, పాపారావు, కళావతి, శ్రీను, ఐఈఆర్‌టీలు రాజేశ్వరి, రవి, తేజశ్వని, సత్య, సూర్య, సరిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యారావు

నిర్వహణ లేక.. నిరుపయోగం

● మరమ్మతులు చేయరు.. కొత్తవి నిర్మించరు ● విపత్తుల సమయంలో తప్పని అగచాట్లు

● ఇదీ తీర ప్రాంతంలోని తుఫాన్ షెల్టర్ల పరిస్థితి



ముక్కాంలో శిథిలావస్థకు చేరిన తుఫాన్ భవనం

భోగాపురం: జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ తీర మండలాల్లో గల తుఫాన్ షెల్టర్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దశాబ్దాలపాటు మరమ్మతులకు నోచుకోవడంలేదు. మొత్తం 29 కిలోమీటర్ల పరిధిలో కొత్త షెల్టర్ల నిర్మాణానికి ప్రభుత్వం ముందుకురావడం లేదు. దీంతో విపత్తుల సమయంలో పాఠశాలల భవనాలు, కల్యాణ మండపాల్లో నిర్వాసితులు, మత్స్యకారులు తలదాచుకోవల్సి వస్తోంది. తోటపల్లి, కొండరాజుపాలెంలో నేషనల్ సైక్లోన్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టు నిధులతో నిర్మించిన భవనాలు జనవాసాలకు దూరంగా ఉన్నాయి. కొండరాజుపాలెం భవనం వినియోగంలో ఉన్నా తోటపల్లి వద్ద భవనం వినియోగంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ మండల్లాలోని తీర గ్రామాల ప్రజలు అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫాన్ల వల్ల భయాందోళనకు గురవుతున్నారు. ఇక్కడి మత్స్యకా రులు పదేళ్ల కిందట సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ పేరు వింటేనే వణికిపోతున్నారు. ఆ సమయంలో వేలాది ఇళ్లు నేలమట్టం కాగా, వందలాది మంది నిర్వాసితులుగా మారిన విషయం విదితమే. అప్పట్లో సరైన షెల్టర్లులేక మత్స్యకారులు అవస్థలకు గురయ్యారు. పకృతి వైపరీత్యాల సమయంలో పునరావాసం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీరప్రాంత గ్రామాల్లో నివసించే వారికి లక్షలాది రూపాయలు వెచ్చించి తుఫాన్‌షెల్టర్లు నిర్మించాయి. ప్రస్తుతం నిర్వహణ లేక అవి నిరుపయోగంగా మారాయి.



వినియోగంలోలేని చినకొండ్రాజుపాలెంలో తుఫాన్ భవనం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీర గ్రామాల్లో తుఫాన్ల సమయంలో నిర్వాసితులు, మత్స్యకారులు తలదాసుకోవడానికి అందుబాటులో ఉండేవిదంగా రూ.లక్షలు వెచ్చించి తుఫాన్ రక్షిత భవనాలు నిర్మించారు. ఇవి కొద్ది సంవత్సరాల పాటు తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఉపయోగించారు. ఆ తర్వాత నిర్వహణ లోపం వల్ల నిరుపయోగంగా మారాయి. దాదాపు అన్ని భవనాలు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరాయి. కొన్ని చోట్ల వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మా రాయి. భవనాలన్నీ కూలిపోయే విధంగా ఉండడంతో తుఫాన్ సమయంలో వాటిలో తలదాసుకొంటే అవి ఎక్కడ కూలిపోతాయోనని భయాందోళన చెందుతున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. అయితే రెండు మండలాల్లో పలుచోట్ల తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో లేనివిదంగా అక్కడక్కడ బహుళప్రయోజన భవనాలు నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. ఈ భవనాలు కూడా మందుబాబులకు అడ్డాగా మారాయి. ఈ నేపథ్యంలో తుఫాన్ల సమయంలో పాఠశాలలు, ఆలయాలు,ప్రైవేటు భవనాల్లో తలదాచుకోవల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని భోగాపురం మండలంలోని ముక్కాం, చోడిపల్లిపేట, చినకొండ్రాజుపాలెం, పెదకొండ్రాజుపాలెం, చేపలకంచేరు, ఎర్రముసలయ్యపాలెం, కోలవానిపాలెం, పూసపాటిరేగ మండలంలో చింతపల్లి, నీలిగెడ్డపేట, బర్రిపేట, పెద్దూరు, కొత్తూరు, తమ్మయ్యపాలెం, బర్రిపేట, తిప్పలవలస, కొత్తూరు, మద్దూరు, కోనాడ, బొడ్డుగురయ్యపేట, బొడ్డువెంకటేషుపేట, పులిగెడ్డ తీరానికి ఆనుకుని ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 15 వేల మంది జనాభా నివసిస్తున్నారు. కడలి కల్లోలంగా మారితే తొలుత ఆ ప్రభావం మత్స్యకారులపైనే పడుతోంది. ఆ సమయంలో అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకొంటున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడంలేదని మత్స్యకారులు వాపోతున్నారు. తక్షణమే శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చి తుఫాన్ల సమయంలో తలదాచుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా కొత్త తుఫాన్ భవనాలకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని భోగాపురం తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తుఫాన్ వస్తుందని సమాచారం వస్తే ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు ప్రజలకు తరలిస్తామని చెప్పారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?

● ఎమ్మెల్యే జోగారావుకు సవాల్ విసిరిన కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గాన్ని ఏ ప్రభుత్వ కాలంలో అభివృద్ధి చేశారో గౌరవ ప్రదమైన వేదికపై చర్చించేందుకు సిద్ధమేనా అంటూ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావుకు సవాల్ విసిరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జోగారావు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో పార్వతీపురం నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారని ఆయన ప్రశ్నించారు. ఈనెల 14న జోగారావు ఇంటి వద్ద వలంటీర్లు సమావేశాన్ని నిర్వహించారని, అది తెలిసి మేము వెళితే వలంటీర్లు ఏ విధంగా పరుగులు పెడుతున్నారో వీడియో ద్వారా స్పష్టంగా తెలుస్తుందంటూ.. ఆ వీడియోను ఆయన విలేకర్లకు చూపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జోగారావు స్వగ్రామంలో టీడీపీలో చేరికలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు స్వగ్రామం చిలకలపల్లి నుంచి పెద్ద ఎత్తున అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం టీడీపీలో చేరారు. పార్వతీపురం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బలిజిపేట మండల టీడీపీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. వీరందరికీ టీడీపీ కూటమి అభ్యర్థి విజయచంద్ర కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పాలకొండ:** ఎం.సింగుపురం గ్రామం నుంచి సుమారు 20 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాయకులపై కేసుల నమోదు

పార్వతీపురం రూరల్: వెంకంపేట పంచాయతీ పరిధిలో ఈనెల 14న వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు ఇంటికి సమీపంలో జరిగిన ఘటనలకు సంబంధించి రూరల్ పోలీస్ స్టేషన్‌లో టీడీపీ, వైసీపీ నాయకులు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. తనను కులం పేరుతో తిట్టారని, దౌర్జన్యంగా వ్యవహరించారని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర.. ఎమ్మెల్యే జోగారావుతో వైసీపీ నాయకులు జక్కు ప్రవీణ్, పాలవలస మురళీకృష్ణ, ఎస్.సందీప్, రణభేరి చిన్నమనాయుడు, బంకురు రవికుమార్, కొండపల్లి బాలకృష్ణ, సువ్వాడ శ్రీనివాసరావు, నిమ్మకాయల సుధీర్‌లపై ఫిర్యాదు చేశారు. అలాగే వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావు.. తనను కులం పేరుతో దూషించారని, తన ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యం చేశారని టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్రతో పాటు కోరాడ ప్రసాద్, బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, బోను దేవి చంద్రమౌళి, అక్కేన శివకుమార్‌లపై ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ దినకరన్ సోమవారం చెప్పారు. టీవీ రిపోర్టర్ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకుడు ఎస్.శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వైసీపీ అభ్యర్థి జోగారావుపై టీడీపీ ఫిర్యాదు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావుపై చర్యలు తీసుకోవడంలో పార్వతీపురం ఎన్నికల అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని టీడీపీ కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం పార్వతీపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేమలతకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి జోగారావు ఈ నెల 14న వలంటీర్లతో తన ఇంటిలో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదు చేసినప్పటికీ సకాలంలో అధికారులు స్పందించలేదని విలేకరులకు చెప్పారు. తాను ప్రచారం చేసే ప్రాంతానికి వస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చివరి వరకూ ఉంటున్నాయని... వైసీపీ అభ్యర్థి ప్రచారం వద్దకు మాత్రం వెళ్లడం లేదన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి... తగు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలకు లేఖ రాసినట్టు విజయచంద్ర తెలిపారు.

మధ్యాహ్నం భగభగ.. సాయంత్రం చిరుజల్లులు



నిర్మానుష్యంగా ఉన్న మక్కువ ప్రధాన రహదారి



కవిరిపల్లి సమీపంలో కురుస్తున్న వర్షం

మక్కువ: మండలంలో సోమవారం ఎండ తీవ్ర రూపం దాల్చింది. ఉదయం 8 నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అయితే సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురవడంతో కొంతమేర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఎండ ధాటికి తాళ లేక..

సాలూరు రూరల్: సాలూరులో సోమవారం ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత మొదలయ్యింది. సోమవారం సాలూరు మన్యంలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఎండ ధాటికి తాళలేక మేకల కాపరులు మేకలను చెట్టు నీడకు చేర్చి, సేద తీరారు.



ఎండ దాటికి చెట్టు కిందకు చేరిన మేకలు

హిందూ ధర్మానికి హాని కలిగితే సహించను



ప్రసంగిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి

సాలూరు రూరల్: హిందూ ధర్మానికి హాని జరిగితే ఏ ప్రభుత్వంపైన అయినా అలుపెరగని పోరాటం చేస్తానని ఆంధ్రప్రదేశ్ సాధు సంతుల పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్పష్టం చేశారు. సాలూరులోని మెంటాడ వీధిలో నిర్వహిస్తున్న సీతారాముల వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆయన సోమవారం రాత్రి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. సమాజంలో ధర్మ పరిరక్షణకు తాను కషాయం కట్టి సేవ చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా సంగీత విభావరి ఏర్పాటుచేశారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి



ఏఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న జగదీష్, చిరంజీవులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పోలీసులను కోరారు. సోమవారం పార్వతీపురం ఏఎస్పీ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. పార్వతీపురంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు టీడీపీ, జనసేన, బీజేపీలు సహకరిస్తాయని ఏఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా వెంకటరావు, డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ముహూర్తపు రాట

మక్కువ: మక్కువ శ్రీసాయి రామలింగేశ్వరాలయంలో శ్రీరాముని కల్యాణానికి సోమవారం ముహూర్తపు రాట వేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కలప అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి

బొబ్బిలి: టేకు, మామిడి, వేప తదితర చెట్లను నరికి అక్రమ రవాణా చేస్తుండడంపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు ఎ.సురేష్ డిమాండ్ చేశారు. రంగరాయపురం సమీపంలో రెండు ట్రాక్టర్లలో రవాణా అవుతున్న కలపను సురేష్ పట్టుకుని అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతం నుంచి అక్రమంగా రాజాం, గజపతినగరం ప్రాంతాలకు విలువైన కలప తరలిపోతోందని, ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నార అన్నారు.

వారపు సంతలో సౌకర్యాలేవీ?

● కానరాని షెడ్లు.. నాణ్యత లేని సరుకులు
● ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

మక్కువ: నంద గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతలో సౌకర్యాలు లేక గిరిజనులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గిరి శిఖర గ్రామాల గిరిజనులు పంట ఉత్పత్తులను సంతలో విక్రయించి... తమకు కావాల్సిన నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్తా ఉంటారు. రోడ్డుపక్కనే ఎండలో నిర్వహించే సంతలో సరుకులు కొనుగోలు అనంతరం మహిళలు చంటి పిల్లలు, చిన్నారులతో సమీప చెట్ల కింద సేద తీరాల్సి వస్తోంది.. మరోవైపు సంతలో విక్రయించే నాణ్యత లేని సరుకులతో రోగాల బారిన పడడం గిరిజనులకు అలవాటుగా మారింది. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి సంతకు సమీపంలో షెడ్లు ఏర్పాటు చేయించాలని.. వ్యాపారులు నాణ్యమైన వస్తువులు విక్రయించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



వారపు సంత నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

కూటమితోనే అభివృద్ధి: జయకృష్ణ



ప్రచారంలో పాల్గొన్న జయకృష్ణ

భామిని: కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం మొట్టమొదటి సారిగా ఆయన భామిని మండలంలో ప్రచారం చేశారు. మండుటెండలో మహిళలు ఆయనకు హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గర్భాన సత్తిబాబు, రవినాయుడు, ఎం.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● **పాలకొండ:** కూటమి అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ అన్నారు. వారు సోమవారం పాలకొండలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో అధికసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. వీరఘట్టం మండల కేంద్రానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి కూటమిలో చేరారు.

పొడి పంచాయతీలో జగదీశ్వరి ప్రచారం



పొడి గ్రామంలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

కురుపాం రూరల్: పొడి పంచాయతీ పరిధిలోగల పొడి, కొరెండిగూడ, ఒప్పంగి, సంతోషపురం, బూర్జమాను గూడ గ్రామాల్లో కూటమి అభ్యర్థి తోయిక జగదీశ్వరి సోమవారం విస్తృత ప్రచారం చేశారు. తనను గెలిపించాలని కోరారు. టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, నాయకులు కోలా రంజిత్ కుమార్, బీజేపీ నాయకుడు నడుకూరు ధూళికేశ్వరరావు, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయం

సాలూరు: కూటమి అభ్యర్థులను గెలిపించడమే తమ ప్రధాన ధ్యేయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంటీజీ నాయుడు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హాల్‌లో సోమవారం బీజేపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణిలను గెలిపించటమే ప్రధాన ధ్యేయమని అన్నారు. అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రసన్న కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా అప్పలనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ గొర్లె భానోజీరావు పాల్గొన్నారు.

టీడీపీ వైపు గ్రామాల చూపు

● సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



సాలూరు: పార్టీలో చేరినవారితో సంధ్యారాణి, భంజ్‌దేవ్

సాలూరు రూరల్: వైసీపీ పాలనకు విసుగు చెంది, అభివృద్ధిని కాంక్షించి టీడీపీ వైపు గ్రామాలు చూస్తున్నాయని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలం నెలిపర్తికి చెందిన 16 కుటుంబాలు మాజీ సర్పంచ్ రాపాక అప్పమ్మ ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరినట్టు ఆమె తెలిపారు. వారికి ఆమెతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజన్నదొర 18 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి.. నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 70 కుటుంబాలు

సాలూరు: వైసీపీని వీడి టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతోంది. తాజాగా 24, 26, 27 వార్డులకు చెందిన 70 కుటుంబాలు, 200 మంది యువకులు కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు సమక్షంలో సోమవారం డబ్బి వీధిలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

బాబు సీఎం కావడమే లక్ష్యం: విజయచంద్ర



విజయచంద్రకు హారతి ఇస్తున్న మహిళలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యమని టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలోని 12, 13 వార్డుల్లో ఆయన సోమవారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ● **సీతానగరం (బలిజిపేట):** మండలంలోని పెద్దింపేట, పోలినాయుడువలస, గౌరీపురం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పార్వతీపురంటౌన్: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం



సాలూరు: అగ్నిప్రమాదాలు ఎలా నివారించాలో డెమో చేసి చూపిస్తున్న అగ్నిమాపక అధికారులు



పాలకొండ: నీటితో విన్యాసాలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురంటౌన్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం అగ్నిమాపక అధికారి పైడిరాజు అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అగ్ని ప్రమాదాల నిరోధానికి సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. గృహిణులు అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. ● **సాలూరు:** అగ్ని ప్రమాదాలపై అప్రత్తంగా ఉండాలని సాలూరు అగ్నిమాపక అధికారి ఉప్పాడ సుధాకర్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక కేంద్ర అధికారులు

సోమవారం పట్టణంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో విద్యుత్, గ్యాస్ కారణంగా సంభవించే వివిధ అగ్ని ప్రమాదాలకు సంబంధించి డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ● **పాలకొండ:** అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు అవసరమని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు కూడళ్ల వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కార్గిల్ జంక్షన్‌లో అగ్నిమాపక సిబ్బంది నీటితో అభివాదం చేస్తూ పలు విన్యాసాలు చేశారు. రెవెన్యు డివిజన్ కార్యాలయం, పాలకొండ మడల విద్యాశాకాధికారి, ఎంపీడీవో, పంచాయతీరాజ్ కార్యాలయాల్లో కరపత్రాలు అందించారు. ● **గజపతినగరం:** అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు స్థానికులు తక్షణమే సమాచారం అందజేయాలని అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వే స్టేషన్లలో అగ్ని ప్రమాదాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్ వాడకం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలి

మక్కువ: ఉపాధి హామీ వేతనదారుల సంఖ్య పెరిగేలా చూడాలని ఎంపీడీవో పి.దేవకుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మేట్‌లకు ఆయన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, పాచిపెంట ఏపీవో మహేష్, ఈసీ వెంకటలక్ష్మి, మేట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవకుమార్

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



పాలకొండ: ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



సాలూరు: మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కార్మికులు

పాలకొండ: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పాలకొండ గౌరవాధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. జీవో ఎంఎస్ నెంబర్-36 ప్రకారం కొత్త జీతాలు, బకాయిలు వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందాలు అమలు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సురేష్, సంజీవి, కార్తీక్, విమల, శ్రీదేవి, రఘు, భాస్కర్, మధు తదితరులు ఉన్నారు.

జీతాలు ఇప్పించండి

సాలూరు: తమకు రావాల్సిన జీతాలు, బకాయిలు...బోనస్‌లు ఇప్పించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మున్సిపల్ అధికారులను సోమవారం నిలదీశారు. మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ తమకు వచ్చే కొద్దిపాటి జీతాలతోనే కుటుంబాలను పోషించుకుంటున్నామని అన్నారు. జీతాలు రాకపోతే పస్తులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. పండగ నెల బోనస్‌లు, బకాయిలు కూడా ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు జీతాలు, బకాయిలు చెల్లించాలని కోరారు. దీనిపై కమిషనర్ ప్రసన్నవాణి మాట్లాడుతూ రెండు రోజుల్లో జీతాలు, బకాయిలు, బోనస్‌లు అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారంతా విధుల్లో చేరారు.

పోస్టల్ బ్యాలెట్ల కోసం దరఖాస్తులు



దరఖాస్తు చేసుకుంటున్న ఉద్యోగులు

కురుపాం: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం సోమవారం అధికారులు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

టీడీపీలోనే కొనసాగుతా: భూదేవి

పాలకొండ: తాను జనసేన పార్టీకి రాజీనామా చేయనున్నట్టు ఇటీవల టీడీపీని వీడి జనసేనలోకి చేరిన పడాల భూదేవి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నేళ్లగా టీడీపీలోనే ఉన్న భూదేవి ఇటీవల పాలకొండ అసెంబ్లీ స్థానాన్ని జనసేన కేటాయించడంతో ఆ సీటు కోసం ప్రయత్నించారు. దీనిలో భాగంగా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. అయితే జనసేన అధిష్ఠానం పాలకొండ టికెట్‌ను జయకృష్ణకు కేటాయించింది. దీంతో మళ్లీ టీడీపీలోనే కొనసాగుతానని ఆమె స్పష్టంచేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: సాలూరు, పాచిపెంట మండలాల్లో విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణకు సోమవారం వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించారు. ఆరోగ్యపరం గా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

క్లుప్తంగా..

ప్రభుత్వ ఐటీఐలో రక్తదాన శిబిరం

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఐటీఐ విద్యార్థులతో పాటు సీతంపేట వైటీసీ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. వీరిని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, డీడీ అన్నదొర అభినందించారు.

అనారోగ్యంతో వైసీపీ కన్వీనర్ మృతి

జియ్యమ్మవలస: వైసీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు (55) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈయనకు భార్య శశికళ జడ్పీటీసీ సభ్యురాలు. కుమార్తె ప్రణీత, కుమారుడు జస్వాంత్ ఉన్నారు.

ఘనంగా రఘురామ విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

భామిని: చిన్నదిమిలి గ్రామంలో రఘురామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు హోమం, వేదాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులు రఘురామను దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు శ్రీనివాసశర్మ, సురేష్‌బాబు, ఎస్.చంటిబాబు, రవిశాస్త్రి బృందంతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించారు.

ఎస్‌వోకు సత్కారం

సాలూరు రూరల్: ఇంటర్ ఒకేషనల్ గ్రూప్‌లో శతశాతం ఫలితాలు సాధించిన ఖరాసవలస కేజీబీవీ ఎస్‌వో గాదిపిల్లి ప్రశాంతిని డీఈవో జి.పగడాలమ్మ సోమవారం సత్కరించారు. ఉత్తమ ఫలితాల సాధనకు మరింత కృషి చేయాలని ఆమె సూచించారు.